క్లుప్తంగా

అభిమానుల అన్నదానం



అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన అభిమానులు పేదలకు అన్నదానం చేపట్టారు. శనివారం చంద్రగిరి నియోజకవర్గం మల్లయ్యపల్లెలో ముందుగా కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కార్యక్రమంలో నేతలు బొమ్మగుంట రవి, కుప్పిరెడ్డి, భాస్కర్ రెడ్డి, గురుమూర్తియాదవ్, మట్టిరెడ్డి నవీన్‌రెడ్డి, మురళీరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రాజారెడ్డి, శంకర్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

విజయరాజు యాదవ్‌కు డాక్టరేట్



తిరుపతి సిటీ : ఎస్వీయూ కామర్స్ విభాగ పరిశోధకుడు రాచుగాళ్ల విజయరాజు యాదవ్ డాక్టరేట్ పొందారు. ఆయన ప్రొఫెసర్ ఎం.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో 'పర్ఫార్మెన్స్ ఎవల్యూషన్ ఆఫ్ సెలెక్ట్ నిఫ్టీ-50 కంపెనీస్' అనే అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు.

నేర ప్రవృత్తి వీడకుంటే చర్యలు

తిరుపతి క్రైం : రౌడీషీటర్లు నేరప్రవృత్తిని వీడకుంటే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ వెంకటనారాయణ హెచ్చరించారు. ఆదివారం తిరుపతి నియోజకవర్గ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐ రామకృష్ణ పాల్గొన్నారు.

విన్నపాలపై చర్చ అవసరం

తిరుపతి కల్చరల్: అన్నమయ్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో చేసిన విన్నపాలపై ఈ నెల 24న నిర్వహించనున్న టీటీడీ బోర్డు సమావేశంలో చర్చించడం అవసరమని కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి కోరారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తిరుమలలో తొలగించిన అన్నమయ్య ఇంటిని పునర్నిర్మించాలని సూచించారు. స్పందించకుంటే నిరసనకు దిగుతామని స్పష్టం చేశారు. సంక్రాంతి వెంకటయ్య, రజని, చంద్రకళ, స్వప్న, దేవానంద్ పాల్గొన్నారు.




ఎస్వీయూలో రామానుజన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు, గణిత దినోత్సవంలో అధ్యాపకులు, విద్యార్థులు

గణిత మేధావికి ఘన నివాళి

తిరుపతి సిటీ : గణిత శాస్త్ర అభివృద్ధికి శ్రీనివాస రామానుజన్ చేసిన సేవలు చిరస్మరణీయమని వీసీ సీహెచ్ అప్పారావు కొనియాడారు. ఆదివారం వర్సిటీలోని రామానుజన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 'గణిత శాస్త్రం..అనువర్తనాలు-2024' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును రిజిస్ట్రార్ భూపతినాయుడుతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ రాధాకృష్ణమాచార్య, గణిత శాస్త్ర విభాగాధిపతి ఆచార్య సి.జయ సుబ్బారెడ్డి, విశ్రాంత ప్రొఫెసర్ డి.భాస్కర్ రెడ్డి, అధ్యాపకులు సుధాకరయ్య, సుగుణమ్మ, భారతి, రాజేష్ యాదవ్, వాసుదేవ రెడ్డి, విశ్రాంతాచార్యులు విజయకుమార్ వర్మ, శ్రీనాథ్, విశ్వనాథ రెడ్డి పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో..
పద్మావతి మహిళా వర్సిటీలో ఆదివారం జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా రామానుజన్ చిత్రపటానికి నివాళుర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటలక్ష్మి, రిటైర్డ్ ప్రొఫెసర్లు సరోజమ్మ, లీలారత్నం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి.విశాలి, డాక్టర్ శివపార్వతి పాల్గొన్నారు

తిరుపతి గాంధీ రోడ్ : గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ విగ్రహానికి బీజేపీ నేతలు పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుండాల గోపీనాథ్ రెడ్డి, సుబ్రమణ్యం యాదవ్, తొండమనాటి సుబ్రమణ్యం రెడ్డి, రాజశేఖరరెడ్డి, గరికపాటి రమేష్ బాబు, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ జీవీఎస్ ప్రసాద్, కల్లూరు చెంగయ్య, కిరణ్ కుమార్, లక్ష్మీకాంత్, శ్రీనివాసులు, విశ్వనాథ్ పాల్గొన్నారు.

నగరంలో కార్డన్ సెర్చ్

తిరుపతి క్రైం : నగరంలోని ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం వేకువజామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో స్కావెంజర్స్ కాలనీ, అప్పన్న కాలనీలో తనిఖీలు చేపట్టారు. రికార్డులు లేని 21 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలోనే హెల్మెట్ వేసుకోని ద్విచక్రవాహనదారులకు రెండో ఘాట్ రోడ్‌లో తిరుమల ట్రాఫిక్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఆత్మీయ పలకరింపు

తిరుపతి అర్బన్ : తిరుపతి జిల్లాకు కొత్తగా నియమితులైన డీఎం హెచ్ఓ డాక్టర్ బాలకృష్ణనాయక్‌ను వైద్యఆరోగ్య సిబ్బంది ఆదివారం తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వైద్యఆరోగ్యశాఖలోని సమస్యలపై చర్చించారు.



డీఎండ్‌హెచ్‌ఓకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

మధుమేహంపై అవగాహన

తిరుపతి కల్చరల్ : వినాయకసాగర్ వద్ద ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీనివాస ఆధ్వర్యంలో వాకర్స్ అసోసియేషన్ సహకారంతో మధుమేహంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆస్టర్ నారాయణాద్రి వైద్యుడు సాయిరామ్ తేజ్ మాట్లాడుతూ జీవనశైలిలో మార్పులతో మధుమేహం నివారించవచ్చని తెలిపారు. అనంతరం పలువురికి షుగర్ పరీక్షలు చేశారు. ఆర్కాట్ కృష్ణప్రసాద్, వి.జగన్నాథం, రఘు, శాంతి, బాలాజీ నాయుడు, శివారెడ్డి, సాయికృష్ణంరాజు, నరసింహయ్య, రామస్వామి పాల్గొన్నారు.

కళలతో సమాజ చైతన్యం

తిరుపతి కల్చరల్ : కళలతో సమాజ చైతన్యం సాధ్యమని పలువురు వక్తలు తెలిపారు. శ్రీకృష్ణ నటరాజాలయం ఆధ్వర్యంలో డ్యాన్స్ ఫెస్టివల్ మహతి కళాక్షేత్రంలో ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. మేయర్ శిరీష, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, చిన్నంగారి రమణ, గుండాల గోపీనాథ్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, విజయకుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ నాట్యాచార్యుడు కొండా రవి కృషిని అభినందించారు. నృత్యోత్సవాలలో సుమారు 400 మంది కళాకారులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమావేశం

తిరుపతి కల్చరల్ : బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఆదివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా దివ్యాంగు సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డయ్య ఆధ్వర్యంలో దివ్యాంగుల అభ్యున్నతికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. బత్తిన మధుబాబు అన్న వితరణ చేశారు.

ఎస్వీయూలో స్క్రాప్ విక్రయం

తిరుపతి సిటీ : ఎస్వీయూలో ఏళ్ల తరబడి పేరుకుపోయిన స్క్రాప్‌ను అధికారులు విక్రయించారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు 7 లారీల స్క్రాప్‌ను అమ్మగా రూ.9లక్షల ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. మరో రూ.6లక్షల స్క్రాప్ మిగిలి ఉందని వివరించారు.

రజకుల అభ్యున్నతే లక్ష్యం

తిరుపతి కల్చరల్ : రజకుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు రజక కార్పొరేషన్ డైరెక్టర్లు మధు, కరాటే చంద్ర తెలిపారు. ఆదివారం అసోసియేషన్ కార్యాలయంలో మధు, కరాటే చంద్రను రజక సంఘం నేతలు ఘనంగా సత్కరించారు.

ట్రెక్కింగ్ జోష్!



దట్టమైన శేషాచల అటవీప్రాంతంలో పర్యటించేందుకు ట్రెక్కర్లు విపరీతంగా మొగ్గుచూపుతుంటారు. ప్రకృతి సొబగులను ఆస్వాదించేందుకు ఆసక్తి చూపుతుంటారు. అందులో భాగంగా ఆదివారం తిరుపతి అడ్వంచర్స్ టీమ్ ఆధ్వర్యంలో చెన్నై.. బెంగళూరుకు చెందిన 30 మందికి పైగా సందర్శకులు చంద్రగిరి నుంచి అడవిలోకి ప్రవేశించారు. రెట్టించిన జోష్‌తో ట్రెక్కింగ్ పూర్తి చేశారు.
– తిరుపతి మంగళం

నృత్యం వాహ్!



శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. నెల్లూరుకు చెందిన గురుకృప కళాక్షేత్రం ఆధ్వర్యంలో ప్రదర్శించిన నృత్యాలను ఆకట్టుకున్నాయి. వీక్షకుల కరతాళ ధ్వనులతో పరిసరాలు మార్మోగాయి. – చంద్రగిరి

నేడు కార్పొరేషన్‌లో 'గ్రీవెన్స్'

తిరుపతి తుడా : తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ మౌర్య తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఉదయం10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు.

వెటర్నరీ ఉద్యోగి తీరుపై ఆగ్రహం

పాకాల : మండలంలోని మొగరాల పంచాయతీ వెటర్నరీ ఆస్పత్రి ఉద్యోగి నగేష్ వ్యవహారశైలిపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయన నిర్లక్ష్యం కారణంగా పెద్ద హరిజనవాడకు చెందిన అన్నపూర్ణమ్మ అనే మహిళకు చెందిన ఆవు మృతి చెందిందని ఆరోపిస్తున్నారు. వివరాలు.. ఆవు అనారోగ్యం బారిన పడడంతో శనివారం ఉదయం నగేష్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి ఆవును పరీక్షించి జ్వరం సోకిందని తెలిపాడు. ఇంజెక్షన్ చేసి రూ.200 తీసుకుని వెళ్లిపోయాడు. అనంతరం ఆవుకు ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించడంతో బాధితురాలు వెంటనే నగేష్‌కు ఫోన్ చేయగా వస్తానని చెప్పి ముఖం చాటేశాడు. ఈ క్రమంలో ఆవు కాసేపటికే మృత్యువాత పడింది. నగేష్ మద్యం తాగే వైద్యం చేస్తుంటాడని, తప్పుడు మందు ఇవ్వడంతోనే తమ ఆవు మృతి చెందిందని బాధితురాలు ఆరోపించారు. దీనిపై వెటర్నరీ డాక్టర్ పవన్‌కుమార్‌ను వివరణ కోరగా, తాను సెలవులో ఉన్నానని, విచారించి చర్యలు తీసుకుంటానని వెల్లడించారు.

ఘనంగా శారదామాత జయంతి

తిరుపతి కల్చరల్ : ఇస్కాన్ రోడ్డులోని రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో ఆదివారం దివ్యజనని శారదామాత 172వ జయంతిని ఘనంగా నిర్వహించారు. మాత చిత్రపటాని కి పుష్పాంజలి ఘటించారు. స్వామి సుకృతానంద పాల్గొన్నారు.
పాకాల: శ్రీ రామకృష్ణ మందిరంలో శారదామాత జీవిత్ర చరిత్రను డాక్టర్ ఎ.లీలా వివరించారు. డాక్టర్ ఎన్‌సీ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

రేకుల షెడ్డు కూల్చేశారు సారూ..

పాకాల : సుమారు 3 ఏళ్లుగా నివాసం ఉంటున్న తన రేకుల ఇంటిని కూల్చి వేశారని, తనకు న్యాయం చేయాలని రెడ్డెమ్మ అనే మహిళ ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె మీడియాతోమాట్లాడుతూ మొగరాల పంచాయతీ రెడ్డివారి వీధిలోని గ్రామకంఠం స్థలంలో రేకుల షెడ్డు వేసుకుని నివాసం ఉంటున్నట్లు తెలిపింది. ఇంటికి విద్యుత్ మీటరు కూడా తన పేరిట ఉందని చెప్పింది. గెనిమగట్టుపల్లికి చెందిన కృష్ణయ్య, ఆయన కుమారులు ఏకాంబరం, సుందరయ్య తన రేకుల షెడ్డును అన్యాయంగా కూల్చి వేశారని విలపించింది. పోలీసులు తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసింది.

పరుగు తీసిన కోడెగిత్తలు

చంద్రగిరి: మండలంలోని రాయలపురం పంచాయతీలో ఆదివారం పరుష పందేలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోడెగిత్తలు పరుగులు తీశాయి. కట్టడి చేసేందుకు యువత ముందుకు ఉరికింది. గిత్తలకు కట్టిన పలకను చేజిక్కించుకునేందుకు పోటీ పడింది. ఈ క్రమంలోనే గిత్తలు కుమ్మడంతో రామచంద్రాపురం మండలం సూరేవారిపల్లికి చెందిన వెంకటాద్రి, రాయలపురానికి చెందిన రాజు, పాతపేట ఆకుతోటకు చెందిన మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 వాహనంలో రుయా ఆస్పత్రికి తరలించారు.

ఇళ్ల కూల్చివేతపై ఆవేదన

తిరుపతి కల్చరల్ : ఏళ్ల తరబడి నివసిస్తున్న ఇళ్లను రెవెన్యూ అధికారులు కూల్చివేశారని వేదాంతపురం పంచాయతీ వినాయకనగర్‌కు చెందిన బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. 1971లో ప్రభుత్వం తమకు అవిలాల పరిధిలోని సర్వే నంబర్ 513/16,153/19లో ఎకరా 40 సెంట్లను ఇళ్ల కోసం కేటాయించిందన్నారు. 1976లో డీ నమూనా పట్టాలను మంజూరు చేసిందని వెల్లడించారు. కూటమి నేతలు కబ్జా చేసుకునేందుకు అధికారుల సాయంతో తమ ఇళ్లను కూల్చి వేశారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.











